క్లుప్తంగా

చిన్నారులకు టపాసులు, మిఠాయిలు పంపిణీ



మధురానగర్(విజవాడసెంట్రల్):బీఆర్‌టీఎస్ రోడ్డుకు చెందిన హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన బుధవారం నిరుపేద, అనాథ చిన్నారులకు టపాసులు, మిఠాయిలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు కోరంగి నాగమల్లిక, షఫీవుల్లా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దీపావళి పండుగను జరుపుకోవాలనే ఉద్దేశంతో తాము ట్రస్టు సభ్యులు, దాతల సహకారంతో బాణసంచా పంపిణీ చేస్తున్నామన్నారు. పేద పసి హృదయాలు చినబోకుండా చిన్నారులకు సంతోషాన్ని పంచేందుకు ట్రస్టు తరఫున టపాసులు, మిఠాయిలు పంపిణీ చేశామన్నారు.

తాగునీరు పరిశీలన



మధురానగర్(విజయవాడసెంట్రల్):నగరపాలక సంస్థ వాటర్ వర్క్స్ సిబ్బంది ఎట్టకేలకు స్పందించారు. 32వ డివిజన్‌లో తాగునీటి కుళాయిల్లో నీరు మురికిగా వస్తుంది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఈ విషయాలను వివరిస్తూ సాక్షి బుధవారం ' కుళాయిల నుంచి మురికినీరు ' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన వాటర్ వర్క్స్ సిబ్బంది తాగునీటిని పరీక్షించి పరీక్షలు నిర్వహించారు.

మధురంగా సాగిన గాత్ర కచేరి



విజయవాడ కల్చరల్: స్వరఝరి సంగీత సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో సంగీత మూర్తి త్రయంలో ఒకరైన ముత్తుస్వామి దీక్షితార్ వర్ధంతి సందర్భంగా గాంధీనగర్ సన్యాసిరావు వీధిలోని సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సంగీతోత్సవం మధురంగా సాగింది. నగరానికి చెందిన యువ సంగీత కళాకారులతోపాటు, సీనియర్ విద్వాంసులు ముత్తుస్వామి దీక్షితార్ రచించిన కీర్తనలు మధురంగా ఆలపించారు. లంక తేజస్విని నిర్వహించిన కచేరి ఆకట్టుకుంది. పార్వతీ కుమారం, సత్యనారాయణం ఉపాస్మహే, గణేశాత్పూరం, అన్నపూర్ణే విశాలాక్షి, గురుగుహ తదితర కీర్తనలు ఆలపించారు. సంగీత విద్వాంసులు అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్‌తోపాటు పలువురు సంగీత విద్వాంసులు పాల్గొన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి మోదుమూడి సుధాకర్ ముత్తుస్వామి దీక్షితార్ సంగీత సేవలను వివరించారు.

మద్యం దుకాణం వద్దంటూ ధర్నా

మధురానగర్(విజయవాడసెంట్రల్): నివాసాల మధ్యలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ బుధవారం దేవీనగర్‌లో స్థానికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంతంగా ఉండే దేవీనగర్ 7, 8 రోడ్డులో మద్యం దుకాణం ఏర్పాటు చేయటం తగదన్నారు. ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేయటం వల్ల ప్రశాంతత దెబ్బతింటుందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు పునరాలోచన చేసి ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తాము ఉద్యమం చేయటానికి సిద్ధంగా ఉన్నామంటూ హెచ్చరించారు. అనంతరం మద్యం దుకాణం వద్దంటూ నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన చేశారు.

బైపాస్ రహదారిలో నిలిచిపోయిన ట్రాఫిక్

భవానీపురం(విజయవాడపశ్చిమ):గొల్లపూడి బైపాస్ రహదారిపై దాదాపు రెండు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. గొల్లపూడి మైలురాయి సెంటర్ సమీపంలో పెద్ద గొయ్యి తీయడం, బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి అక్కడ నీళ్లు చేరటంతో నిత్యం రద్దీగా ఉండే బైపాస్ రహదారిలో రాకపోకలు సాగించే లారీలు, టిప్పర్లు, బస్సులు, కార్లు ఎక్కడికి అక్కడ నిలిచిపోయాయి. ఈ క్రమంలో స్కూల్స్ వదిలే సమయం కావడంతో స్కూల్ బస్‌లు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుని విద్యార్థులు నానా ఇబ్బందులు పడ్డారు. ప్రతి రోజూ సమయానికి వచ్చే పిల్లలు ఇంకా రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. గొల్లపూడి మైలురాయి సెంటర్ నుంచి హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ గేట్ వరకు పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోవడంతో ద్విచక్రవాహనదారుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. మైలురాయి సెంటర్‌లో బీటు నిర్వహించే పోలీసులు మినహా మరెవ్వరూ రాకపోవడంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చాలా సమయం పట్టింది.

పార్కుల్లో ఆహ్లాదం కరువు!

- పార్కుల నిర్వహణను పట్టించుకోని ప్రభుత్వం
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారిన వైనం



కండ్రికలో చెత్తడంపింగ్ కేంద్రమైన పార్కు



వ్యర్థాతో నిండి వున్న ఎస్‌ఎస్‌సీ బోస్ నగర్లో పార్కు

పాయకాపురం(విజయవాడరూరల్):వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు ఏర్పాటు చేసిన పార్కులు ప్రస్తుతం అనారోగ్యాలను పంచే ప్రాంతాలుగా మారిపోయాయి. పార్కుల నిర్వహణను ప్రభుత్వం గాలికి వదిలేయడంతో ముళ్ల పొదలు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. పార్కులు చెత్తా చెదారంతో పేరుకుపోయి డంపింగ్ కేంద్రాలుగా కనబడుతున్నాయి. కొన్ని పార్కులు తాళం వేసి దర్శనమిస్తున్నాయి. మరికొన్ని పార్కులను పట్టించుకునే వారు, పర్యవేక్షించేవారు లేక ప్రారంభించి ఏడాది కాక ముందే పూర్తి అధ్వానంగా మారిపోయాయి. 64వ డివిజన్ లగడపాటి కళ్యాణమండపం సమీపంలోని పార్కు పేరుకే పార్కు ఆ ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు పెరిగి అడవిగా కనబడుతుంది. పనికిరాని గృహోపకరణాలు అందులో డంప్ చేయడంతో డంపింగ్‌యార్డును తలపిస్తుంది. చీకటిపడితే ఆ చుట్టుపక్కల వున్న పోకిరీలు మద్యం సేవించే వారు, బ్లేడ్‌బ్యాచ్, గంజాయి సేవించే వారు ఆ పార్కులోనే మకాం వేస్తున్నారు. చుట్టుపక్కల గృహాల్లోని మహిళలు, ఆడపిల్లలు బయటకు రావడానికి భయపడుతున్నారు. ఆ పార్కుకు గేట్లు లేకపోవడంతో ఇష్టం వచ్చినట్టుగా వ్యవహరిస్తున్నారు. అదే విధంగా డివిజన్లో ఎస్సీ కాలనీలో వున్న పార్క్ మరీ దారుణంగా ఉంది. వర్షం వస్తే వర్షం నీరు చుక్క కూడా బయటకు వెళ్లే పరిస్థితి లేదు. ఆ పార్కును అభివృద్ధి చేయాలని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిపాదించినా ఇంత వరకు కనీసం గేటు కూడా పెట్టిన దాఖలాలు లేవు. ఆ ప్రాంతంలోని బడుగు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలు పార్కుల్లో ఆహ్లాద కరమైన వాతావరణానికి నోచుకోలేదు. ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసుకునేందుకు వాకింగ్ ట్రాక్‌లేదు. పిల్లలకు జారుడుబల్లలు, ఊయల లాంటివి ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. రాధానగర్లోని పార్కు లో మొక్కలు పెట్టారు, చుట్టూ ఫెన్సింగ్ నిర్మించారు. కానీ ఏం లాభం స్థానికులు ఎప్పుడైన వెళ్లి వాకింగ్ చేద్దామంటే తాళాలువేసి ఉంటున్నాయి.

పార్కింగ్‌లా మారిన పార్కులు...

రాధానగర్లో ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయడంతో అక్కడ పార్కు వాతావరణం కనిపించడంలేదు. భవానీబారు సమీపంలో పలగాని పార్కు చుట్టూ వున్న ఐరన్ ఫెన్సింగ్ తొలగించి వుండటంతో కార్లు పార్కింగ్, లారీల పార్కింగ్ ప్రాంతంలా మారిపోయింది. పార్కు రూపాన్ని కోల్పోయి కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్ నిండి ఉంది. ప్రజాశక్తి నగర్లో కమ్యూనిటీ హాలు పక్కనే వున్న పార్కు మరమ్మతులకు నోచుకోని అలంకార ప్రాయంగా కనబడుతుంది. విలేజి కుందావారి కండ్రికలో వాటర్ ట్యాంక్‌కు సమీపంలో వున్న పార్కు ఆక్రమణలో ఉంది. ఆక్రమణలను తొలగించి పార్కు ఏర్పాటు చేయా లని గ్రామస్తులు అనేక దఫాలు వీఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేసినా ఇంత వరకు అతీగతీ లేదు. 62వ డివిజన్ సాయిబాబా గుడిని ఆనుకొని వున్న పార్కు రాత్రి సమయాల్లో పార్కుగా దానికి నిక్‌నేమ్ వుంది. చీకటిపడితే మద్యం సేవించే వారు దాన్ని బార్‌లో ఉపయోగించుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. 63 వ డివిజన్ వీకర్స్ సెక్షన్స్ 6వ లైనులో పార్కుకు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసినా అది తాళం వేసి ఉంటుంది. ఉడా కాలనీలో పార్కు సైతం అదే పరిస్థితి నెలకొంది. ఈ విధంగా పడివున్న పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు ఉపయోగపడేవిధంగా తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధి చేయాలి



డివిజన్లో ఉన్న 11 పార్కులను ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలి. ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసేందుకు వీలుగా మారిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలి.

– డి.ప్రసాద్

ఉల్లాసంగా మార్చాలి



నగరంలోని ప్రజలకు ఉల్లాసంగా ఆహ్లాదాన్ని అందించే విధంగా పార్కులను అభివృద్ధి చేయాలి. పార్కులపై పర్యవేక్షణ ఉండాలి. ఈ మేరకు ఆయా శాఖలకు చెందిన అధికారులు చర్యలు తీసుకోవాలి.

–నాగేంద్రబాబు

సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు



మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడ సెంట్రల్): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ప్రజానీకానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు బుధవారం ఒక ప్రకటనలో దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. చీకటి మీద వెలుగు, చెడు మీద మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ.. ప్రజల జీవితాల్లో కోటి ఆనందాల కాంతులు నింపాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటి లోగిలి దీపకాంతులతో వెలుగులీనాలని.. నియోజకవర్గ ప్రజలందరికీ సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు కలగాలని కోరుకున్నారు. ప్రజలు సుఖసంతోషాలతో జీవించేలా దీవించాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ మంచి జరగలానే తపనతో పనిచేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయం నెరవేరేలా ఆయనకు మరింత శక్తిని ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నారు. ప్రతిఒక్కరూ క్షేమకరంగా, పర్యావరణహితంగా దీపావళిని జరుపుకోవాలని.. ప్రకృతికి విఘాతం కలిగించని, కాలుష్య రహిత గ్రీన్ టపాసులనే కాల్చాలని కోరారు. సర్వమతాల వారు ఆనందంగా జరుపుకునే వేడుకల్లో నియోజకవర్గ ప్రజలందరూ తగు జాగ్రత్తలు పాటించాలని మల్లాది విష్ణు సూచించారు.

ఎస్‌ఆర్ఆర్ కళాశాలలో జాతీయ ఐక్యత దినోత్సవం



ఏక్తాదివస్ ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్):మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యాన రాష్ట్రీయ ఏక్తాదివస్ జాతీయ ఐక్యత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ దేశ ఐక్యతకు కృషి చేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అన్నారు. ఆయన జయంతి సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తించుకునే దానికి ప్రత్యేకగా ప్రపంచంలోనే అత్యంత భారీ సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని గుజరాత్‌లో ఏర్పాటు చేశారని తెలిపారు. దేశం కోసం ప్రతి ఒక్కరూ ఒకటవ్వాలని సూచించారు. రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం ఏక్తా దివస్ విశిష్టతను వివరించారు. అనంతరం ఏక్తా దివస్ ప్రతిజ్ఞని విద్యార్థులతో చేయించారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ కొల్లేటి రమేష్, సంస్కృత విభాగాధిపతి డాక్టర్ రమణ మూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగ్‌నగర్‌లో తగ్గిన 'దీపావళి' సందడి..



సింగ్‌నగర్ ఎంబీ స్టేడియంలో ఏర్పాటుచేసిన దీపావళి స్టాల్స్



స్టాల్స్ వద్ద కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):దీపావళి పండుగ కాంతి అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో ఈ ఏడాది తగ్గినట్లు కనిపిస్తుంది. ఇటీవల బుడమేరు వరదల్లో ఇక్కడి ప్రజలంతా అన్ని విధాలుగా నష్టపోవడమే దీనికి ప్రధాన కారణమని వ్యాపారులు భావిస్తున్నారు. సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియం ఆవరణలో ఐదు బాణసంచా విక్రయాల స్టాల్స్‌ను ప్రస్తుతం ఏర్పాటుచేశారు. అయితే గతేడాది దీపావళి ముందు రోజే సగం వరకూ వ్యాపారాలు జరగ్గా ఈసారి మాత్రం పావు వంతు కూడా బేరాలు జరగలేదని దుకాణదారులు చెబుతున్నారు. దీనికి తోడు వాతావరణం కూడా చినుకులు పడుతూ ఉండడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. పండుగ రోజు అయినా వాతావరణం అనుకూలంగా ఉండి, వ్యాపారాలు చక్కగా జరిగితే బాగుంటుందని వారంతా ఆశపడుతున్నారు.

తైక్వాండో జట్టులో పీబీ సిద్ధార్థ విద్యార్థులు



కృష్ణా వర్సిటీ తైక్వాండో జట్టుకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

విజయవాడస్పోర్ట్స్:అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా యూనివర్శిటీ జట్టుకు పీబీ సిద్ధార్థ ఆర్ట్స్, సైన్స్ కాలేజీ విద్యార్థులు ఎంపికయ్యారని ఆ కాలేజీ వ్యాయామ విద్యా అధ్యాపకులు డాక్టర్ టి.వి.బి.కృష్ణారెడ్డి తెలిపారు. ఇటీవల కైకలూరులో జరిగిన వర్సిటీ అంతర కళాశాలల పోటీల్లో పీబీ సిద్ధార్థ విద్యార్థులు సాయిప్రశాంత్, విక్టర్ ఆదిత్య, రోహిత్, కృష్ణవంశీ, దుర్గాప్రసాద్, కుమార్‌లు పలు బరువు కేటగిరీల్లో సత్తా చాటి బంగారు పతకాలు సాధించారన్నారు. అనంతరం జరిగిన వర్సిటీ జట్టు ఎంపిక పోటీల్లో అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. నవంబర్ ఆరు నుంచి తొమ్మిదో తేదీ వరకు అమృత్‌సర్‌లోని జీఎన్‌డీ వర్సిటీలో జరిగే జాతీయ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను కాలేజీ అధ్యక్షులు డాక్టర్ సి.నాగేశ్వరరావు, కార్యదర్శి పి.లక్ష్మణరావు, కన్వీనర్ ఎస్. వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వి.బాబురావు, డీన్ రాజేష్ సి.జంపాల కాలేజీ ప్రాంగణంలో బుధవారం అభినందించారు.

అంబేడ్కర్ విగ్రహం జోలికొస్తే తిరుగుబాటు తప్పదు

దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్



సామాజిక న్యాయ మహా శిల్పాన్ని సందర్శించిన దళిత బహుజన పార్టీ నేతలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం జోలికి వస్తే తిరుగుబాటు తప్పదని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ హెచ్చరించారు. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దేశానికే తలమానికంగా సామాజిక న్యాయ మహా శిల్పాన్ని నిర్మించిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మహాశిల్పాన్ని చూసి బెంబేలెత్తిపోతోందన్నారు. అత్యంత విలువైన భూమిపై ప్రభుత్వ పెద్దల కన్నుపడిందన్నారు. ఈ విగ్రహాన్ని, మ్యూజియంను తొలగించి ప్రైవేటు సంస్థకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం తొలగించాలని చూస్తే సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలోనే సర్కార్‌పై తిరుగుబాటు చేస్తామన్నారు. శిల్పం వద్ద ఉన్న పేరును తొలగించారని, ఆ మహనీయుని విగ్రహానికి, మ్యూజియంకు ఎటువంటి హాని జరిగినా దేశ వ్యాప్తంగా అంబేడ్కర్ వాదులు తిరగబడతారన్నారు. మధ్యలో నిలిచిపోయిన కన్వెన్షన్ హాల్ నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. స్మృతి వనం నిర్వహణకు రూ. 500 కోట్లు నిధులు ఏటా కేటాయించాలని, నిర్వహణ సక్రమంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల కృష్ణ బాబు, పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ ఉప్పాడ రామచంద్ర రెడ్డి.మీడియా విభాగం జిల్లా ఇన్‌చార్జి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

3న సమావేశాన్ని విజయవంతం చేద్దాం



తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేతలతో సమావేశమైన దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యకర్తలతో ఆత్మస్థైర్యాన్ని నింపేలా నవంబరు 3న విజయవాడలో నిర్వహించనున్న విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేద్దామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గంలోని పార్టీ కీలక నాయకులతో బుధవారం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపేలా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాలుగు నెలల్లోనే ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేలా ప్రతి కార్యకర్త సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర సీనియర్ నాయకుడు కడియాల బుచ్చిబాబు, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, కార్పొరేటర్లు, డివిజన్ ప్రెసిడెంట్‌లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

దర్గాలో గంధ మహోత్సవం

భవానీపురం(విజయవాడపశ్చిమ):పశ్చిమ నియోజకవర్గం 38వ డివిజన్ పరిధిలోగల సూఫీ మత గురువులు హజరత్ సయ్యద్ అలీ హుస్సేన్ షా ఖాదిరీ (రహమతులాలై) దర్గాలో బుధవారం నిర్వహించిన గంధ మహోత్సవం వైభవంగా జరిగింది. మేళతాళాలు, ఫకీర్ల భక్తి కీర్తనల నడుమ బాబావారి ఛాదర్ గంధాన్ని గుర్రంపై ఏర్పాటు చేయగా పుర వీధుల్లో అందరికీ దర్శనమిస్తూ ఊరేగింపు ముందుకు సాగింది. దర్గా ముతవల్లి షేక్ ఖాజా మొయిద్దీన్ పర్యవేక్షణలో జరిగిన ఈ గంధ మహోత్సవ కార్యక్రమంలో భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. గురువారం సాయంత్రం దర్గా వద్ద దీపారాధన కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా, నజీర్ బాబా, బాజీ బాబా, హుస్సేన్ బాబా పాల్గొని బాబా ఆశీస్సులు అందుకున్నారు.

ఆకట్టుకున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాల మాక్ డ్రిల్

పున్నమిఘాట్‌లో వివిధ అంశాలపై డెమానిస్ట్రేషన్



నదిలో పడిన వారిని రక్షిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్



రక్షణ చర్యలకు నదిలో దూసుకెళ్తున్న దృశ్యం

భవానీపురం(విజయవాడపశ్చిమ): అత్యవసర, ప్రమాదకరమైన సమయాల్లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఏపీ ఎస్‌డీఆర్‌ఎఫ్) అందించే సేవలను ప్రజలకు తెలియ చేసేందుకు కృష్ణానది తీరానగల పున్నమిఘాట్‌లో బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సీహెచ్ శ్రీకాంత్ (ఐజీపీ,ఏపీఎస్‌పీ బెటాలియన్స్ అండ్ ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్), బి.రాజకుమారి (డీఐజీపీ, ఏపీఎస్‌పీ బెటాలియన్స్), 6వ బెటాలియన్ కమాండెంట్ డి. వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ కమాండెంట్ ఎం.వాసుదేవరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 6వ బెటాలియన్ ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది వాటర్ ఎంట్రీ, స్విమ్మింగ్ స్టైల్స్, రెస్క్యూ టెక్నిక్స్, బోట్ క్యాప్సర్ అండ్ రీ సైడ్, సెర్ఫ్ ప్యాటర్న్స్, స్కూబీ డైవింగ్ అంశాలలో డెమో చేసి కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ప్రమాదవశాత్తు నదిలో మునిగిపోతున్నవారి ప్రాణాలను కాపాడి ఒడ్డుకు తీసుకురావడం, ఒక్కో సారి నదిలో పడిపోయిన వ్యక్తిని కాపాడేందుకు వెళ్లిన రెస్క్యూ టీమ్ సభ్యుడినికూడా తనతోపాటు నీళ్లల్లోకి లాగేసే సమయంలో తనను తాను సేవ్ చేసుకుంటూ బాధితుడిని ఎలా రక్షించాలి? అదే విధంగా నదిలో పడవలో ప్రయాణిస్తూ పార్టీ చేసుకుంటూ అందరూ ఒక వైపుకు చేరినప్పుడు పడవ బోల్తా కొట్టి అందరూ నీళ్లల్లో పడిపోయినప్పుడు వారిని ఎలా రక్షించాలి? వరదల సమయంలో నీటి ఉధృతికి కొట్టుకుపోతున్న వ్యక్తిని ఎలా రక్షించాలి? వంటి పలు అంశాలను ప్రదర్శించి పోలీసులు, విద్యార్థుల హర్షధ్వానాలు అందుకున్నారు. నదిలో మునిగిపోతున్న వారిని రక్షించే క్రమంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం ఈదుకుంటూ వెళ్లి లైఫ్ బాయ్, త్రో రోప్ వంటి పరికరాలను వారికి అందించి కాపాడటం చూపించారు. కాగా ఇటీవల విజయవాడలో సంభవించిన బుడమేరు వరదల్లో ఏపీ ఎస్‌డీఆర్‌ఎఫ్ నుంచి 12 టీములు 21 ప్రాంతాలలో బాధితులకు సేవలు అందించాయని ఆయా బృందాలకు నేతృత్వం వహించిన సీనియర్ అధికారులు తెలిపారు. అజిత్‌సింగ్‌నగర్, పరిసర ప్రాంతాల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం 260 మంది ప్రాణాలను కాపాడిందని, 15వేల మంది బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారని, అలాగే సుమారు 50 వేల మంది వరద ముంపు బాధితులకు ఫుడ్ ప్యాకెట్స్, వాటర్ అందించారని అధికారులు ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాల/కళాశాలల విద్యార్థులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ ట్రైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



మధురానగర్(విజయవాడసెంట్రల్):నగరపాలకసంస్థ యూజీడీ వర్క్స్ సిబ్బంది ఎట్టకేలకు స్పందించారు. 29వ డివిజన్ మధురానగర్‌లో యూజీడీ పనులలో భాగంగా తవ్విన రోడ్డును సరిచేశారు. ఇక్కడ యూజీడీ పనులు నత్తనడకన సాగుతున్నాయని, రోడ్డును తవ్వి సరిచేయకపోవటంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాలను వివరిస్తూ సాక్షి బుధవారం' నత్తనడకన యూజీడీ పనులు ' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు తవ్విన రోడ్డును తాత్కాలికంగా డస్ట్‌తో సరిచేశారు. ప్రస్తుతం రాకపోకలకు అనువుగా ఉన్నప్పటికీ వర్షం పడితే గోతులు పడే ప్రమాదం ఉందని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు శాశ్వత మరమ్మత్తులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్ఎన్‌పురం సీఐ బాలరాజాజీ



సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ బాలరాజాజీ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):రోజు రోజుకు పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సైబర్ నేరాల సంఖ్య కూడ పెరుగుతుందని, ప్రజలు వాటిపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఎన్ పురం ఇన్‌స్పెక్టర్ వై.బాల రాజాజీ పేర్కొన్నారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం గాంధీనగర్, ఐనాక్స్ థియేటర్ వద్ద ఉన్న సిద్ధార్థ అపార్టుమెంట్ ప్రాంగణంలో స్థానిక ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా బాల రాజాజీ మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్ వాడే ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. స్మార్ట్ ఫోన్‌లు వాడే వారే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు రకరకాల ప్రలోభాలకు గురిచేసి నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా లోన్స్ యాప్స్, బ్యాంకుల నుంచే మొబైల్ ఫోన్‌లకు వచ్చే లింక్‌లను క్లిక్ చేయడం ద్వారా సైబర్ నేరగాళ్లు తమ బ్యాంకు ఖాతాలోని నగదు మాయం చేస్తారని హెచ్చరించారు. అదే విధంగా తమ నివాసాల పరిసర ప్రాంతాలలో సీసీ కేమేరాలను ఏర్పాటు చేసుకోవాలని, ఇళ్ల చుట్టు పక్కల అనుమానితులు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాల్సిందిగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్ పురం సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నగర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు



రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగర ప్రజలకు మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర సంయుక్తంగా బుధవారం ఓ ప్రకటనలో దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. నగర ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకొని దీపావళి పండుగను సురక్షితంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. హరిత బాణసంచా కాల్చుకోవాలని, వాతావరణ కాలుష్యాన్ని కాపాడాలని సూచించారు. టపాసులు కాల్చుకునే సమయంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

శ్రీ శివకామేశ్వరీ పీఠంలో మాస శివరాత్రి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో బుధవారం శ్రీధర్మ పరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు నీలకంఠేశ్వర స్వామికి పంచామృత అభిషేకం, అర్చనలు నిర్వహించారు. అనంతరం శివకామేశ్వరీ అమ్మవారికి పంచ హారతులు ఇచ్చారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.